# ప్రాణంతీసిన పండు

ఊరి చివర కాలవ నిండుగా ప్రవహిస్తోంది. వానలు వచ్చాక, కాలవలో వరదలు పొర్లినట్లు రేగడి మట్టితో కూడిన ఎర్రని నీరు చిక్కగా గంతులు వేస్తూ పారుతోంది. కాలవగట్టున చెట్లు గాలికి రివ్వున ఊగుతున్నాయి, రెండుగజాల దూరంలో గట్టుకు ఎత్తుబండ పైన వీరమ్మ కాపురముంటోంది ఒక చిన్న యింట్లో.

భర్తకు మిగిలిన ఆస్తి ఒక్కటే ఆ యిల్లు. ఆ ఊరి చివరి ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వెంకన్న ఒకరోజున ప్రమాదానికి గురిఅయ్యాడు. ఉన్నట్లుండి ఒక పెద్ద మెషీను, క్రింద ఉన్న అండ ప్రీగి పోవడంతో, కూలి వెంకన్నమీద పడింది. అంతే...వెంకన్న జీవితం ఆఖరయింది. వీరమ్మ మొత్తుకుంది. ఏడ్చింది...ఆవిషాదగాథ వీరమ్మ దృష్టిలో యింకా పచ్చిగానే వుంది.

ఆ కాలవగట్టునే వెంకన్న మామకు వీరమ్మకు మొదట పరిచయమయ్యింది. పొరుగూరినుంచి తన తాతయ్యను చూద్దామనివచ్చిన వీరమ్మ మొదటిసారిగా తాతయ్య ఇంట్లోనే వెంకన్నను చూసింది. నూనూగు మీసం, కండలు తిరిగినఒళ్ళు, నగ్నవక్షస్థలం, పంచ బిగకట్టి పొలంపోయే రైతులా మొదటకనిపించిన వెంకన్న ఆమెనుఆకర్షించాడు, అందులో తాతయ్యకు అతనంటే అభిమానం— తాతయ్య స్నేహితుడు పోలయ్య కొడుకు వెంకన్న— తర్వాత కాల్వగట్టున ఓరోజు సాయంత్రం మల్లెపూలు తురుముకుని షికారు వెడుతూంటే, దారిలో త్రాచుపాము అడ్డువచ్చింది— వెంకమ్మ

బెదిరిపోయింది. ఎక్కడినుండి వచ్చాడో– వెంకన్న హఠాత్తుగా వచ్చి పామును చంపాడు. వీరమ్మ నిట్టూర్పు విడిచింది. ప్రాణం కాపాడి నందుకు– అతనిమీద ప్రేమ, గౌరవం పెరిగినందుకు– ఆ ప్రథమ దృష్టి ఇప్పటికీ వీరమ్మ మనసులో మెదులుతూనే వుంది. ఆరేళ్ళ కాపురం పూర్తి కాకుండానే వెంకన్న చనిపోయాడు–చనిపోయేటప్పటికి ముగ్గురుకొడుకుల్ని ఇచ్చిపోయాడు. వీరమ్మ జీవితములోని ఆశలన్నీ ఆకుర్రకుంకలమీదే నిలుపుకుని బ్రతుకుతోంది.

గత ఆరు సంవత్సరాల్లో ఎన్నో మార్పులు– తాతయ్య చనిపో యాడు– వెంకన్న తండ్రికూడా పరమపదించాడు– భర్తపోయాక ఒంటరి బ్రతుకైపోయింది వీరమ్మకు.

వెంకన్న బ్రతికున్నరోజుల్లోకూడా ఆవూళ్ళో నేతివ్యాపారం సాగిం చేది వీరమ్మ. అతను చనిపోయాక అదే వ్యాపారం కొంచెం యింకా శ్రమతో చేయవలసి వచ్చేది.

ఆరోజు పంతులుగారింటికి నెయ్యియివ్వడానికివెడితే ఆయన మామిడి పండ్లు రెండు చేతిలోపెట్టాడు– అవి రసాలు... వానాకాలం వచ్చాకకూడా రసాలు చేతికందడం సంతోషమయింది వీరమ్మకు. ఆ రెండుపళ్ళు చూడ గానే యింటిదగ్గర పిల్లలుజ్ఞప్తికి వచ్చారు.వంటవండి భోజనంచేసేటప్పుడు పిల్లలకు రసంతీసి పెడదామనుకుంటూ యింటివైపు పట్టింది వీరమ్మ.

9 గంటలు దాటింది – సూరువెచ్చదనం నరాల్లో క్రొత్త సత్తువ యిస్తోంది. ఇంటికి రాగానే వీధిలో పిల్లలు ఆడుకుంటున్నారు. అయిదు, మూడు, ఒక సంవత్సరం –పిల్లలు ముగ్గురూ. ఆఖరిపాప తడబడుతూ నడుస్తున్నాడు. వీరమ్మ ఇంటికి రాగానే పిల్లలు చుట్టుముట్టారు. గంప దింపింది. ఆయాసంగా వీరమ్మ...పిల్లలు గంపచుట్టూమూగారు "మామిడి పండు–నాకూ–" అంటూ గంపమీద పడ్డారు పెద్ద పిల్లలిద్దరూ.

"ఇప్పుడుకాదు –పరగడపున . ఆనక అన్నంతో తిందురుగాని" అంది వీరమ్మ.

"ఊహూ" అని మారాం చేశారు పిల్లలిద్దరూ.

వీరమ్మ విసుక్కుంది.

గంపదీసుకుని వంటింట్లోకెళ్లింది కోపంగా. పెద్ద గూడులో అటక పక్క పెట్టిన చిన్నకుండలో ఆ రెండుపళ్లు వేసింది. కిందనేఉన్నమూత ఆ కుండపైపెట్టి మూసింది. అది పిల్లలు గుర్తించ లేదన్నట్టు అటూ ఇటూ చూసి పనికి ఉపక్రమించింది. కాలవనీళ్లు తేవడానికి మరోకుండ తీసుకొని ఆఖరిపాప నెత్తుకుని కాలవ వైపు నడిచింది వీరమ్మ.

తల్లి మామిడిపళ్లు దాచటం పెద్దపిల్లాడు చూశాడు చాటుగా. తల్లిని కాలువకు వెళ్లనిచ్చాడు తాపీగా, ఏమీఎరగనట్టు బుద్ధిగా కూర్చొని గోళ్ళు గిల్లుకుంటున్నాడు. "వీరమ్మ వెళ్ళేటప్పుడు 'ఇప్పుడేవస్తా' అని కదిలిన వీరమ్మ ఇల్లుదాటి ఒక గజం నడిచేదాక వేచివున్నాడు పెద్దపిల్లాడు.

'ఒరే తమ్ముడూ' పిలిచాడు పెద్దాడు. అమ్మ మామిడి పళ్లు పెట్టిన కుండ తెలుసు, తిందామా_ 'నీకోటి_నాకోటి' అన్నాడు పెద్దాడు.

చిన్నాడికి నోరూరింది___ 'ఊ' సైగచేసి ఒప్పుకున్నాడు. ఇద్దరూ మెల్లిగా వంటింట్లోకి వెళ్ళారు. కుండ పైనమూతతీశారు. పెద్దాడు చెయ్యి లోపలికి పోనిచ్చాడు.

'అమ్మోయి' అరుస్తూ క్రిందవాలాడు. 'ఏమిటిరా' అంటూ చిన్నాడు కుండ అంచు పట్టుకున్నాడు లోపల తొంగిచూద్దామని.

'బాబోయి' అంటూ చిన్నాడు అరిచాడు, ఇద్దరూ గిలగిల తన్నుకుంటూ నేలమీదవాలారు.

కుండ లోంచి కాలసర్పంలాంటి త్రాచు బుస కొడుతూ లేచినాట్యం చేసింది.

అదేసమయానికి అర్జంటుగా నేతికోసం వచ్చిన నాయుడుగారి బుల్లి పాప అక్కడకువచ్చి పాముబుస పిల్లలుఏడుస్తూ నేలకూలడం చూసింది.

'పాము_పాము' అంటూ అరుస్తూ వీధిలోకి వెళ్ళింది. బుల్లిపాప జనంమూగారు. వీరమ్మ కాలవగట్టున ఆమడదూరంలో స్నానం చేస్తోంది. అదిచూసి ప్రక్కింటి ఆసామి ఆ వైపు పరిగెత్తి వీరమ్మకు వినిపించేలా అరిచాడు.

'మీపిల్లల్ని పాము కరిచింది!'

వీరమ్మగంగవెర్రులెత్తినట్లు ఆశ్చర్యపోయింది. ఎలాఉన్నమనిషి _ఈతడిబట్టతో పరుగెత్తుకుంటూ ఇంటివైపు వచ్చింది. ఒంటిల్లులో నురగలు కక్కుకుంటూ ఇద్దరు బిడ్డలూ కళ్ళు తేలవేసి అవసాన దశలో వున్నారు. వీరమ్మ గొల్లుమని ఏడ్చింది. మంత్రాల మగాడికోసం పరుగెత్తాడు ప్రక్కింటి ఆసామి. వాడు వచ్చేటప్పటికి పిల్లలిద్దరూ అసువులు బాశారు. వీరమ్మ గుండెబాదుకుంది. 'మామిడిపళ్ళు యిచ్చేసినా బాగుండునని' రోదించింది. 'మాయదారి సర్పం' తన జీవితం నాశనం చేసిందని గోల చేసింది. ఈమైకం తగ్గాక కాలవగట్టుననే కంగారులో విడిచేసివచ్చిన ఆఖరిపాప జ్ఞప్తికి వచ్చింది. 'అయ్యో నా బాబు...ఏడీ! అనుకుంటూ పిచ్చిగా కాలవగట్టువైపు పరుగెత్తింది వీరమ్మ కాలవగట్టున అంచుమీద రాయి దగ్గరవున్న కుండ అలాగేవుంది...కుండ దగ్గరగా చిన్నారి పాప బురదలో నడచిన జాడలు...ఆజాడలు కాలువలోకి సాగాయి. ఏడీ పాప? ఏడీ? లేడు. కాలువలో సుళ్ళు తిరుగుతున్న నీటి ప్రవాహంలో కుర్రాడు పోయాడా?...వీరమ్మ బెంబేరెత్తిపోయింది_ఏడ్చింది_మొత్తుకుంది_ఒక క్షణం నిర్ఘాంతపోయింది_అంతే కన్నీటిచుక్క లేకుండా పిచ్చిగా మౌనంగా వెర్రిచూపులతో యింటికి వచ్చింది. "నా పిల్లలు ఏరీ? ఏమయ్యారు? 'హిహిహి' అంతే_ ఎవరుఎత్తుకుపోయారు? అరిచింది_ నవ్వింది జుట్టు పీక్కుంది.

రోజూ వూరంతా తిరిగి కమ్మని నెయ్యి అందిచే వీరమ్మ జీవితం విషాదంతో విషకలుషితమైంది. 'మంచినేయి, కమ్మని నేయి' అని వీధుల్లో పిలిచే ఆమె "నా బాబుల్ని నువ్వు చంపావా? హిహిహి!" అంటూ వీధుల్లో తిరుగుతోంది. ★